క్లుప్తంగా

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



సబ్బవరం శాఖా గ్రంథాలయంలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

సబ్బవరం: యోగాసనాలు, సూర్య నమస్కారాలతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, వికాసం కలుగుతాయని వ్యవసాయ శాఖ రిటైర్డ్ జాయింట్ సెక్రటరీ రత్నకుమారి తెలిపారు. సబ్బవరం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులతో యోగాసనాలు వేయించడం, సూర్యనమస్కారాలు చేయించడంతో పాటు న్యూస్ పేపర్లను చదివించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులంతా వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వి.శిరీష, పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెందుర్తి: దివంగత ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళి అర్పించారు. బుధవారం చినముషిడివాడలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. కాంగ్రెస్ నాయకులు ముక్కా రామునాయుడు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు కొబ్బరినూనె పంపిణీ



పారిశుధ్య కార్మికులకు కొబ్బరినూనె, సబ్బులు అందిస్తున్న ముమ్మన దేముడు

పెందుర్తి: వార్డులో ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నట్లు 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. ఎస్‌ఏడీ లేఅవుట్ పార్క్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో జీవీఎంసీ అందించిన కొబ్బరి నూనె, డిటర్జంట్ సబ్బులను దేముడు చేతుల మీదుగా పారిశుధ్య కార్మికులకు అందించారు. ఒక్కొక్కరికి 4 లీటర్ల కొబ్బరి నూనె, 12 సబ్బులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దేముడు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న పారిశుధ్య కార్మికులు తమ ఆరోగ్యాలను రక్షించుకోవాలని సూచించారు. బీజేపీ నేత చిక్కాల సతీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరం



డాన్స్ నేర్చుకుంటున్న విద్యార్థులు

పెందుర్తి: వేసవి శిక్షణ శిబిరం స్థానిక శాఖా గ్రంథాలయంలో ఉత్సాహంగా జరుగుతోంది. అందులో భాగంగా బుధవారం కథలు చదవడం, రాయడం, చెప్పడంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఉపాధ్యాయిని చంద్రకళ చిన్నారులకు 'బుడుగు' అనే నీతి కథను బోధించారు. అనంతరం సామూహిక పుస్తక పఠనం చేయించారు. ఇంగ్లిష్ నేర్పించారు. సులభ పద్ధతిలో లెక్కలు చేసే విధానాన్ని ఎంబీఏ విద్యార్థి నేర్పించారు. నాట్య గురువు ప్రసన్న విద్యార్థులకు సంప్రదాయ నృత్యాలు నేర్పించారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, పలువురు పాఠకులు పాల్గొన్నారు.



క్రీడా మైదానంగా కాలనీవాసులు వినియోగించుకుంటున్న స్థలం



మైదానంలో ఏర్పాటు చేసిన షటిల్ కోర్టు

మా క్రీడా మైదానాన్ని.. మాకు దూరం చేయకండి

- విజ్ఞప్తి చేస్తున్న సింహపురికాలనీ యూత్, క్రీడాకారులు, అసోసియేషన్ నాయకులు, నివాసితులు
- ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులతో నిరాశ
- మరెక్కడైనా ఏర్పాటు చేయాలని అందరి విజ్ఞప్తి
- పోరాటానికైనా సిద్ధమంటూ వెల్లడి

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు పరిధి సింహపురి కాలనీలో ఏళ్ల తరబడి క్రీడా మైదానంగా వినియోగించుకుంటున్న స్థలాన్ని తమకు దూరం చేయొద్దని కాలనీ క్రీడాకారులు, కాలనీ యూత్, కాలనీ అసోసియేషన్, నివాసితులు విజ్ఞప్తి చేస్తున్నారు. కూటమి ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో నిరాశ వ్యక్తం చేస్తున్నారు. చివరకు చేసేది లేక తమ వ్యతిరేకతను తెలియజేసేందుకు కాలనీవాసుతులంతా సిద్ధమవుతున్నారు. వివరాలిల్లోకి వెళ్తే.. వేపగుంట నుంచి పాత గోశాల వైపు వెళ్లే మార్గంలో సింహపురికాలనీ ఉంది. 1993లో కాలనీలో వుడా 320 వరకు వ్యక్తిగత గృహాలు నిర్మించి విక్రయాలు జరిపింది. అప్పట్లో సరసమైన ధరలకు వ్యక్తిగత ఇళ్లు లభించడంతో విశాఖ జిల్లాతో పాటు పలు జిల్లాలకు చెందిన వారు కూడా వాటిని కొనుగోలు చేశారు. కాలనీ ఏర్పాటైన నాటికి సింహపురికాలనీ వేపగుంట పంచాయతీలో ఉండేది. 2007లో జీవీఎంసీలో విలీనమవడంతో 72వ వార్డులోకి వెళ్లింది. అనంతరం వార్డుల పునర్విభజన తర్వాత ప్రస్తుతం 98వ వార్డులో ఉంది.

క్రీడలు, వ్యాయామంతో నిత్యం సందడి..

సింహపురి కాలనీ ఏర్పడిన నాటి నుంచి కాలనీ యువత, క్రీడాకారులు, కాలనీ యూత్ ఇక్కడున్న సుమారు 33 సెంట్ల స్థలాన్ని క్రీడా మైదానంగా వినియోగించుకుంటున్నారు. వాలీబాల్, షటిల్, క్రికెట్ కోర్టులు ఏర్పాటు చేసుకున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వీరు ఆటలాడుకుంటున్నారు. అలాగే ఇక్కడ వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేసుకుని నిత్యం వ్యాయామం చేస్తున్నారు. పలువురు క్రీడాకారులు కోచ్‌లుగా మారి కాలనీలోని చిన్నారులకు క్రీడల పట్ల ఆసక్తి పెంపొందిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వారితో ఆటలు ఆడిస్తూ ప్రోత్సహిస్తున్నారు.

ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు స్థలం కేటాయింపుతో ఆందోళన..

ఇదిలా ఉండగా ప్రస్తుతం క్రీడా మైదానంగా వినియోగించుకుంటున్న స్థలాన్ని పెందుర్తి ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు కేటాయించడంతో సమస్య మొదలైంది. దీంతో కాలనీవాసులు, యూత్, క్రీడాకారులు, అసోసియేషన్ నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఫైర్ స్టేషన్ ఏర్పాటుకి పెందుర్తి నియోజకవర్గంలో మరెక్కడా స్థలమే దొరకలేదా? అంటూ వారంతా దాదాపు మూడు నెలలుగా తమ వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారు. మా క్రీడా మైదానాన్ని మాకు దూరం చేయొద్దని అధికారులు, కూటమి ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయం గడిచిన ఏప్రిల్‌లో సింహపురికాలనీకి వచ్చిన వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ దృష్టికి కూడా తీసుకెళ్లారు. కాలనీవాసులంతా క్రీడా మైదానానికి చేరుకుని తమ వ్యతిరేకత తెలిపారు. దీంతో సమస్యని సానుకూలంగా పరిష్కరిచేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కానీ ఇప్పటికీ ఎలాంటి ఫలితం రాలేదు. ఇదిలా ఉండగా మరో పక్క అగ్నిమాపక కేంద్రం అధికారులు సంబంధిత స్థలంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటుకి చకచకా ఏర్పాట్లు చేసుకుంటుండటంతో కాలనీవాసులు, యూత్ ఈ చర్యలను తప్పు బడుతున్నారు. గురువారమే శంకుస్థాపన చేసేందుకు ఉపక్రమిస్తున్నారన్న సమాచారంతో మరోసారి వారంతా ప్రతిఘటించేందుకు సిద్ధమవుతున్నారు. తమ గళం వినిపించాలనుకుంటున్నారు.



షటిల్ ఆడుతున్న కాలనీ యూత్



మైదానంలో ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలు

ఇది దారుణం



ఏళ్ల తరబడి క్రీడా మైదానంగా వినియోగించుకుంటున్న స్థలాన్ని తీసుకోవడం చాలా దారుణం. కాలనీలో ఉన్న యూత్, క్రీడాకారులకు సంబంధిత స్థలం క్రీడా మైదానంగా ఎంతో ఉపయోగకరంగా ఉంది. కావాలనే సంబంధిత స్థలాన్ని కేటాయించారన్న విషయం కూడా బహిరంగంగా వినిపిస్తోంది. కూటమి ప్రజా ప్రతినిధులు ఈ విషయంపై దృష్టి సారించి న్యాయం చేయాలి.

– నడింపల్లి రామరాజు, సింహపురికాలనీ మాజీ సెక్రటరీ

మా విన్నపాన్ని అర్థం చేసుకోవాలి



సింహపురికాలనీ యూత్, క్రీడాకారులు, స్థానికులు, అసోసియేషన్ నాయకుల విన్నపాలను పరిశీలనలోకి తీసుకుని క్రీడా మైదానంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు విషయాన్ని వెనక్కి తీసుకోవాలి. కాలనీలో ఉన్న క్రీడాకారులకు మేలు చేయాలి. వేరొక చోట స్థలాన్ని కేటాయించాలి. ఈ విషయంపై కాలనీవాసులంతా పోరాటం చేస్తాం.

– యశ్వంత్, సింహపురికాలనీ యూత్

క్రీడా మైదానంగానే కొనసాగించాలి..



కాలనీలో ఉన్న చిన్నారులు, క్రీడాకారులు ప్రతిరోజూ మైదానానికి వచ్చి గేమ్స్ ఆడుతున్నారు. క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుంటున్నారు. కాలనీలోని పలువురికి మైదానం ఎంతగానో ఉపయోగకరంగా ఉంది. అలాంటి స్థలాన్ని దూరం చేయడం చాలా దారుణం. ఇప్పటికైనా ఈ విషయంపై దృష్టి సారించి ఆ స్థలం క్రీడా మైదానంగానే కొనసాగేలా చూడాలి.

– కిషోర్, సింహపురికాలనీ

దివ్యాంగ బాలలు వసతులు వినియోగించుకోవాలి



దివ్యాంగ చిన్నారిని పరిశీలిస్తున్న సహిత విద్య సమన్వయకర్త శకుంతల

సబ్బవరం: దివ్యాంగ చిన్నారులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహిత విద్య సమన్వయకర్త బి.శకుంతల కోరారు. మండలంలోని ప్రత్యేకావసరాలు గల చిన్నారుల నమోదు (సీడబ్ల్యూఎస్‌ఎన్ ఎన్‌రోల్‌మెంట్)లో భాగంగా గొర్లివానిపాలెంలో బడిఈడున్న దివ్యాంగ చిన్నారి ఇంటికి వెళ్లిన ఆమె, చిన్నారి తల్లిదండ్రులతో మాట్లాడారు. చిన్నారిని పాఠశాలలో చేర్పించాలని కోరారు. బడి ఈడు గల దివ్యాంగులు ఎవరైనా బడిలో నమోదు కాకుండా బడిబయట ఉంటే, వెంటనే సంబంధిత ప్రత్యేక ఉపాధ్యాయులకు, ఐఈఆర్‌టీలకు, సచివాలయ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు తెలియజేయాలని, దగ్గరలో ఉన్న పాఠశాలలో చేర్పించాలని సూచించారు.

పిడుగుపాటుకు రెండు పాడి ఆవుల మృతి



మృతి చెందిన ఆవు వద్ద విలపిస్తున్న అప్పలరాజు కుటుంబ సభ్యులు

సబ్బవరం: పిడుగుపాటుకు రెండు పాడి ఆవులు మృతి చెందాయి. మంగళవారం రాత్రి వర్షంతో పాటు పిడుగులు పడటంతో మండలంలోని పెదగొల్లలపాలెం శివారు జగన్నాథపురంలో పాడిరైతు మోపాడ అప్పలరాజుకు రెండు ఆవులు మృతి చెందాయి. దీంతో తమ జీవనాధారం పోయిందని, రైతు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆవులను చెట్ల కింద కట్టడంతో పిడుగుపాటుకు గురయ్యాయని, మృతి చెందిన ఒక్కో ఆవు ధర రూ.80 వేల వరకు ఉందని, మొత్తం రూ.1.6 లక్షల నష్టం వాటిల్లిందని వాపోయాడు. పెయ్యిలను పాకలో కట్టడంతో ప్రాణాలతో మిగిలాయని తెలిపారు. తీవ్రంగా నష్టపోయిన తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

దంచికొట్టిన వాన



వేపగుంట-సబ్బవరం రోడ్డు శ్రీరాంపురం వద్ద గోతుల్లో చేరిన వర్షపునీరు



వేపగుంట-సబ్బవరం రోడ్డు పినగాడి కూడలి వద్ద చెరువును తలపిస్తున్న రోడ్డు

పెందుర్తి: నియోజకవర్గాన్ని వర్షం ముంచెత్తింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి ఉధృతంగా కురిసిన వర్షం బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తెరిపివ్వలేదు. దీంతో లోతట్టు ప్రాంత వాసులు ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై ఎక్కడికక్కడ వర్షపు నీరు నిలిచిపోయింది. పొలాల్లో సైతం నీరు తేలియాడింది. మరోవైపు అక్కడక్కడ ఆలస్యంగా పక్వానికి వచ్చిన మామిడి తోటల రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. చాలాచోట్ల మామిడి కాయలు నేలరాలాయి. కాగా తాజా వర్షాలతో తొలకరి పంటలు వేసేందుకు రైతాంగం సిద్ధమవుతోంది. వర్షాలు తగ్గిన తర్వాత తొలకరి దుక్కులు చేసి అపరాలు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

పరవాడలో..

పరవాడ: మండలంలో రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఉదయం నుంచే ప్రారంభమవుతున్న వర్షాలతో ప్రజలు గడప దాటి బయటికి వెళ్లలేకపోతున్నారు. మంగళ, బుధవారం రెండు రోజుల నుంచి అడపా దడపా కురుస్తున్న వర్షాలకు వాతావరణం పూర్తిగా చల్లబడడంతో గ్రామీణ ప్రజలు కొంత ఉపశమనం పొందారు. ప్రస్తుత వర్షాలు అనేక విధాలుగా ఉపకరిస్తాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పాడి పశువుల పోషణకు అవసరమైన పశుగ్రాసం మొలకెత్తడానికి వర్షాలు అనుకూలిస్తాయని పాడి రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఉదయం నుంచి అడపా దడపా వర్షం కురుస్తూనే ఉంది.



రాంపురం వద్ద పొలాల్లో చేరిన వర్షపు నీరు

అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 9.30గంటల నుంచి నిత్యకల్యాణం కనులపండువగా జరిపించారు. ఆలయ బేడామండపంలో వేదికపై ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కొలువుదీర్చి కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి వారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

విశేషంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం గరుడసేవ విశేషంగా జరిగింది. ఆలయ బేడామండపంలో నిర్వహించిన వేడుకలో స్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై కొలువుదీర్చారు. అష్టోత్తర శతనామావళి అనంతరం హారతి ఇచ్చారు. పూజలో పాల్గొన్న భక్తులతో గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

ప్రజా సమస్యలపై పోరాటానికి సిద్ధం కావాలి

- ప్రజలను నమ్మించి దగా చేసిన కూటమి ప్రభుత్వం
- సూపర్ సిక్స్ హామీల అమలులో విఫలం
- వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకురాలు శోభా హైమావతి

పెందుర్తి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా ప్రజలను దగా చేసిందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకురాలు శోభా హైమావతి విమర్శించారు. ప్రజా సమస్యలపై పూర్తిస్థాయి పోరాటానికి సిద్ధం కావాలని పార్టీ క్యాడర్‌కు సూచించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో రాంపురంలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో ఆమె మాట్లాడారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ బీజేపీతో కలిసి సూపర్ సిక్స్ హామీల పేరిట రాష్ట్ర ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకున్నారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క హామీని కూడా అమలు చేయడం లేదన్నారు. ఇచ్చిన హామీల నుంచి ప్రజలను మరిపించడానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై పోలీసులను ఉసిగొల్పి కేసుల పేరిట వేధిస్తున్నారన్నారు. ప్రభుత్వం ఎన్ని అరాచకాలు చేసినా.. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని కార్యకర్తలు, నాయకులు అదరరు, బెదరరు అని స్పష్టం చేశారు. కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అన్నారు. వచ్చే ఎన్నికల నాటికి అందరూ సైనికుల్లా పనిచేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ప్రతీ కార్యకర్తకు గుర్తింపు

అదీప్‌రాజ్ మాట్లాడుతూ కష్టపడి పనిచేసే ప్రతీ కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. త్వరలోనే పూర్తిస్థాయి అనుబంధ కమిటీలు, గ్రామ, వార్డు కమిటీ, మండల, నియోజకవర్గస్థాయి కమిటీల ప్రక్రియను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ పి.ఎస్ రాజు, పార్టీ నేతలు పైలా శ్రీనివాసరావు, మధుపాడ అంజి, బోకం రామునాయుడు, కోడిగుడ్ల దేవిసాంబ, గొరపల్లి శ్రీను, కర్రి బాబు, కోన రామారావు, కొటాన రాము, గండి రవికుమార్, సబ్బవరపు ముత్యాలనాయుడు, చొప్ప నాగరాజు, పాలిశెట్టి సురేష్‌రాజ్, అప్పికొండ మహాలక్ష్మినాయుడు, గండ్రెడ్డి మహాలక్ష్మినాయుడు, తామర్ల నర్సింగ్, యతిరాజుల నాగేశ్వరరావు, బట్టు పైడిరెడ్డి, పీతల అప్పలరాజు, మోపాడ అప్పారావు, వద్దాది అప్పలరాజు, రాపేటి రాము, జగదీష్, నదీయా, ఎర్ర శ్రీనివాస్, యడ్ల నాయుడు తదితరులు పాల్గొన్నారు.



శోభా హైమావతిని సత్కరిస్తున్న అదీప్‌రాజ్

నేడు ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

పరవాడ: వాడచీపురుపల్లి శివారు దలాయిపాలెంలోవెలసిన శ్రీ ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం గురువారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్స వ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఆలయంలో గురువారం ఉదయం 6 గంటల నుంచి గణపతి పూజ, ప్రత్యేక హోమాలు నిర్వహిస్తామని కమిటీ తెలిపింది. మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి ప్రసాదం స్వీకరించాలని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

యాదవ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

సబ్బవరం: యాదవులకు జనాభా ప్రాతిపదికన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని జిల్లా యాదవ సంక్షేమం సంఘం అధ్యక్షుడు భరణికాన సాయినాథరావు కోరారు. స్థానిక సీతారామ కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యాదవులంతా పార్టీలకతీతంగా సంఘటితం కావాలన్నారు. సబ్బవరం మండల యాదవ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోన సోమేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా చట్టి తాతారావు, మొల్లి కనకరాజు, ప్రధాన కార్యదర్శిగా నమ్మి అప్పారావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా రోమాల వెంకటేష్, కార్యదర్శులుగా పల్ల శివన్నారాయణ, ఉప్పిలి దుర్గారావు, కోన రాము, జాయింట్ సెక్రటరీగా సారిపల్లి నాగరాజు, కోశాధికారిగా ఉప్పిలి రాజు, జాయింట్ ట్రెజరర్‌గా నక్కెళ్ల సన్యాసినాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యాదవ పెద్దలు కోరాడ శ్రీనివాసరావు, పల్ల తాతారావు, పల్ల కృష్ణ, పల్ల సన్యాసిరావు, ఈపు అప్పలరాజు, పినబోయిన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను అభినందిస్తున్న సాయినాథరావు తదితరులు

పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట



ఫార్మాసిటీలో ఆవిష్కరించిన అభయాంజనేయ స్వామి విరాట్ విగ్రహం



పంచముఖ ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న మెట్రోకెం అధినేత వెంకటేశ్వరరావు దంపతులు

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలోని మెట్రోకెం పరిశ్రమ యాజమాన్యం సహకారంతో పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం కనులపండువగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఉదయం 8.51 గంటలకు పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. స్వామికి పరిశ్రమ అధినేత నందెపు వెంకటేశ్వరరావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 10 గంటలకు పరిశ్రమ ఆవరణలో ఏర్పాటు చేసిన అభయాంజనేయ స్వామి విగ్రహావిష్కరణ జరిపారు. ఫార్మాసిటీలోని వివిధ పరిశ్రమలకు చెందిన యాజమాన్య ప్రతినిధులు, భక్తులు అభయాంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వీధి లైట్ల ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

పరవాడ: స్థానిక టిడ్కో గృహ సముదాయంలో వీధి లైట్ల సమస్య పరిష్కారానికి జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. 'సమస్యల నిలయాలు.. టిడ్కో గృహాలు' శీర్షికన మార్చి 29న 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి జీవీఎంసీ అధికారులు స్పందించారు. కాలనీ వీధుల్లో 25 వీధి దీపాలను బుధవారం అమర్చారు. ఇంత వరకు కాలనీలో వీధి దీపాలు లేక అంధకారంతో ప్రజలు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. చీకటి పడితే ఇంటి నుంచి బయటికి రావాలంటే భయపడుతుండేవారు. చుట్టూ దట్టంగా పెరిగిన తుప్పలు, డొంకల కారణంగా విష జంతువులు ఇళ్లలోకి ప్రవేశించడం వల్ల కాలనీ వాసులు భయాందోళనలతో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఈ క్రమంలో జీవీఎంసీ అధికారులు ముందుకు వచ్చి కాలనీలో వీధి దీపాలు వెలిగించడానికి చర్యలు చేపట్టడడంతో కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అదే విదంగా దొంగతనాలను అరికట్టడానికి వీలుగా పరవాడ పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. రేషన్ కోసం దూరంగా వెళ్లడానికి ఇబ్బంది పడుతున్న కాలనీ వాసుల కోసం రేషన్ వ్యాను కాలనీలోకి వచ్చి రేషన్ సరుకులను అందజేస్తుందని చెప్పారు. వీధుల్లో పేరుకుపోతున్న చెత్త తరలించడానికి అవసరమైన చెత్త బండితో పాటు తాగునీటి ఎద్దడి నివారణ కోసం బోరు వెల్ ఏర్పాటు చేస్తే తమ సమస్యలు కొంత మేరకు పరిష్కారం అయినట్లేనని కాలనీ వాసులు కోరుతున్నారు. కాలనీలో వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు చేపట్టిన జీవీఎంసీ అధికారులకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.



టిడ్కో గృహ సముదాయంలో వీధి లైట్లు అమర్చుతున్న సిబ్బంది